క్లుప్తంగా

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శుక్రవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కళోత్సవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. గెలుపొందిన కౌటాల కేజీబీవీ పాఠశాల విద్యార్థులను జిల్లా స్థాయికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణ్‌సింగ్, ఎస్ఓ పవిత్ర, ఉపాధ్యాయులు శ్యాంరావు, భువనేశ్వరి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ వినియోగించుకోవాలి

కౌటాల: జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎస్సై ఎన్.మధుకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న సిర్పూర్(టి) కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని తెలిపారు. దాడుల కేసులు, రోడ్డు ప్రమాదాలు, మోసాలు, వివాహాలు, దొంగతనం, డబ్బుల రికవరీ, తదితర కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షిదారుల కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు. ఫిర్యాదుదారుడు, నేరస్తులు తమ ఆధార్‌కార్డులు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్ కాలనీలోని సిరికొండ క్రుష్ణమూర్తి నివాస పరిసర ప్రాంతంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు కొంత మంది వ్యక్తులు పేకాడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించిన ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. పట్టుపడగా వారి వద్ద నుంచి రూ. 14,190 నగదు, ప్లేయింగ్ కార్డ్స్‌ని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

కాలుష్యాన్ని నివారించాలని వినతి

కాగజ్‌నగర్ రూరల్: ఎస్పీఎం మిల్లు నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించాలని శుక్రవారం సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు బస్తీవాసులు వినతిపత్రం అందజేశారు. ధ్వని, కాలుష్యం, పొగ, దుమ్ము ధూళి విపరీతంగా వస్తుందన్నారు. కళ్ల మంటలు, ఛాతినొప్పి, ఊపిరితిత్తుల వ్యాధులు సోకుతున్నాయన్నారు. మిల్లు నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించడానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు గోలేటి శాఖ అధికారులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకులో ఉన్నటు వంటి పథకాల గురించి బ్యాంకు మేనేజర్ మీర్జాజకీ ఉల్లాబేగ్ వివరించారు. రుణాలు, సామాజిక భద్రత స్కీం, జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి సలుగు శ్రావణ్, క్యాషియర్ వినయ్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రెబ్బెన: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరేందర్ అన్నారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సత్యసాయిబాబా మందిరంలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు గడువు పెంపు

కాగజ్‌నగర్ రూరల్ : బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు సెమిస్టర్-2 పరీక్షల ఫీజు అపరాధ రుసుంతో అక్టోబర్ 2 వరకు చెల్లించుకోవచ్చని కోఆర్డినేటర్ తూదూరు దత్తాత్రేయ తెలిపారు. 2024- 25 సంవత్సరానికి గాను డిగ్రీలో ఆడ్మిషన్ పొందేందుకు ఈనెల 30 వరకు అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

వాంకిడి: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ఎంఈవో శివచరణ్ ఆధ్వర్యంలో రూమ్ టు రీడ్ లైబ్రరీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ రూమ్ టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న పుస్తకాలు, లైబ్రరీ పోస్టర్లు విద్యార్థులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు సునీల్, సందీప్, విజయ్‌బాబు, పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి


కాగజ్‌నగర్ రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజమౌళి, కేదారి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నక్క కనకయ్య, మల్లయ్య, కొంగ సత్యనారాయణ, సామల రాజన్న, అశోక్, నాగేశ్వర్‌రావు, సత్తెన్న పాల్గొన్నారు.

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సింగరేణి అధికారులు ఘనంగా నిర్వహించారు. లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

- గోలేటిలోని పద్మశాలి భవన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాంకిడి: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని లక్ష్మణ్ సేవా సదన్ ట్రస్ట్ చైర్మన్ గాదె అవినాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బాపూజీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గాదె ప్రవీణ్, గుర్నులె నారాయణ, అశోక్ మహోల్కర్, మడావి దౌలత్‌రావు, చంద్రశేఖర్, దుర్గం ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: తెలంగాణ ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కర్ణాగౌడ్, కానోజీ రమేశ్, బండారి వెంకటేశ్, తుకారాం, వంశీ, వెంకట్, వసంత్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: మండలంలోని సలుగుపల్లి గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం నాయకులు, కుల


రెబ్బెన: పూలమాల వేస్తున్న జీఎం నరేందర్

బాంధవులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సామల తిరుపతి, వెంకటేశ్, సత్యనారాయణ, దిలీప్, రాజేష్, విలాస్, సదాశివ, శంకర్ పాల్గొన్నారు.


ఆసిఫాబాద్: నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు


వాంకిడి: నివాళులర్పిస్తున్న ట్రస్ట్ నాయకులు


బెజ్జూర్: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

దహెగాం: మండల కేంద్రంలోని రైతువేదికలో ఆయిల్‌పాం సాగుపై శుక్రవారం ఉద్యానవన శాఖ క్లస్టర్ అధికారి సుప్రజ అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో మొక్కలు 90 శాతం రాయితీపై అందిస్తామని తెలిపారు. అలాగే తోట నిర్వహణ, అంతర పంటల సాగు కోసం ఎకరానికి రూ.4,200 ప్రోత్సాహకం అందిస్తామన్నారు. ఒక్కసారి నాటితే మొక్కల 30 ఏళ్ల వరకు దిగుబడి ఇస్తాయన్నారు. బిందుసేద్యం పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీ, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. పండ్ల


మాట్లాడుతున్న క్లస్టర్ అధికారి సుప్రజ

తోటల పెంపకంపై కూడా 50 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మ్యాట్రిక్ కంపెనీ ఫీల్డ్ అధికారి రమేశ్, ఏఈవోలు వంశీకృష్ణ, లావణ్య, జైన్ కంపెనీ డీసీవో శ్రీనివాస్, ఫీల్డ్ అధికారి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

రెబ్బెన: విద్యార్థులు కష్టపడి చదివి కన్న తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అతియాఖానం అన్నారు. శుక్రవారం కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులంతా ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని అప్పుడే విజయం సాధించవచ్చన్నారు. చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా భావించాలని సూచించారు. తోటి విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రకాష్, శ్రీని


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వాస్, గంగాధర్, అమరేందర్, ప్రవీణ్, రామారావు, వెంకన్న, మంజుల, వెంకటేశ్వరీ, మల్లేశ్వరీ, సుమలత, దీప్తీ, ఝాన్సీ, ఏకలవ్య, నిర్మల, మల్లేషం, శారద, సంధ్య, కృష్ణమూర్తి, అర్జున్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వాంకిడి: మండలంలోని బెండార వద్ద గల ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు దుర్గం నిఖిల్, శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. సరైన రోడ్డు, తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కళాశాల చుట్టూ


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

పిచ్చి మొక్కలు పేరుకుపోయి అటవీ ప్రాంతాన్ని తలపిస్తుందన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

రెబ్బెన: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్సియల్ పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. కౌటాలలో నిర్వహించిన అండర్ 17 జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు అద్భుత ఆట తీరును ప్రదర్శించి ద్వితీయ బహుమతిని సాధించగా.. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించే క్రీడాకారులకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఉన్నత లక్ష్యంతో భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు చదువుతో పాటు క్రీడలను ఒక సాధనంగా మలుచుకోవాలన్నారు. జిల్లా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జోనల్ అధి కారి అరుణకుమారి, వైస్ ప్రిన్సిపాల్ రజిత, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు, పీఈటీ స్వరూప, పీడీ రజిత, తదితరులు అభినందించారు.

కూరగాయల దుకాణాలు తొలగించాలి

బెజ్జూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఆదివాసీ ఆరాధ్య దైవం కుమురం భీం విగ్రహం చుట్టూ ఉన్న కూరగాయల దుకాణాలు తొలగించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎస్సైలను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. కొంత మంది వ్యాపారులు కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేశారని, దీంతో విగ్రహం కనిపించడం లేదన్నారు. ఆ దుకాణాలను వెంటనే తొలగించాలన్నారు. నాయకులు కోరేత తిరుపతి, సిడం సకారాం, ఏనుక శంకర్, సర్‌మెడి కొడప శంకర్, శంకర్, సిడం గంగారాం, అత్రం మాధవరావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ నాయకులు

కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు బోనస్ చెల్లించాలి

రెబ్బెన: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులైన డ్రైవర్లు, క్లీనర్లకు సైతం బోనస్ చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎస్‌వోటూజీఎం రాజమల్లుకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలోని అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా లాభాల వాటా రూ. 5వేల బోనస్‌ను చెల్లించాలన్నారు. సింగరేణి బొగ్గు గనుల్లో ఉత్పత్తి అయ్యే బొగ్గును రవాణా చేసి సంస్థకు వేల కోట్లు లాభాలు రావడంలోనూ, సంస్థ అభివృద్ధిలో కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులతో పాటు అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కోల్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ నాయకులు స్వామి, లక్ష్మీనారాయణ, తిరుపతి, సతీష్, రాజ్‌కుమార్, రమేశ్, శ్యాంరావు, చంద్రకాంత్, శ్రీనివాస్, గోపాల్ పాల్గొన్నారు.


జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నీటి సహాయకులకు శిక్షణ

కౌటాల: మిషన్ భగీరథ గ్రామ మంచినీటి సహాయకులకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ నీటి నాణ్యత ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. నీటి నాణ్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోట ప్రసాద్, డీఈ పృథ్వీరాజ్, ఏఈ ఉదయ్‌వీర్, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని గ్రామ పంచాయతీలలో పని చేసే మంచినీటి సహాయకులకు మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ వారి ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభించారు. టెక్నికల్ ట్రైనర్ నాగరాజు చేతి పంపులు, మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

రెబ్బెన: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు వినోద్ జైస్వాల్, అజ్మీర బాబురావు, తోట లక్ష్మణ్, బొడ్డు రమేశ్, వసంత్‌రావు రాపర్తి శేఖర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సన్మాన సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మెనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఉద్యమకారులందరికీ పెన్షన్, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యమకారుల సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

స్వచ్ఛత పాటిస్తేనే ఆరోగ్యం

కౌటాల: స్వచ్ఛత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటామని డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి బానోతు దత్తారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కౌటాల- కాగజ్‌నగర్ రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం తొలగించారు. ప్రతి ఒక్కరికీ స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీడీవో కోట ప్రసాద్, ఏపీఎం ముక్తేశ్వర్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ, కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సుభాష్ చంద్ర బోస్‌కాలనీ, విజయబస్తీలో శుక్రవారం రాత్రి దేశీదారు మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సుభాష్‌చంద్రబోస్ కాలనీకి చెందిన రతన్‌గుప్తాకు చెందిన దేశీదారు మద్యాన్ని విజయబస్తీలో నిల్వ చేశారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఈ దాడుల్లో 90 ఎంఎల్ 580 బాటిళ్లు లభించాయని, వీటి విలువ రూ.20,300 ఉంటుందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి, రతన్‌గుప్తాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మట్టి రోడ్డే దిక్కు

- అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రాలేని పరిస్థితి
- బస్సెక్కాలంటే 7 కిలో మీటర్లు నడవాల్సిందే
- పట్టించుకోని పాలకులు, అధికారులు


గ్రామాలకు వెళ్లే బురద రోడ్డు

కౌటాల: ఆ గ్రామాలు ఎన్నికలొస్తేనే నేతలకు గుర్తుకొస్తాయి. ఓట్ల పండుగ ముగియగానే అంతా మర్చిపోతారు. ఇక అటువైపు కన్నెత్తి కూడా చూడరు. సమస్యలను ఎవరూ పట్టించుకోరు. బస్సెక్కాలంటే ఏడు కిలో మీటర్లు నడవాల్సిందే. పిల్లలు చదువు కోవాలంటే బురదరోడ్డే దిక్కు. అనారోగ్యానికి గురైతే అంబులెన్స్ రావడానికి సరైన దారి లేదు. ఇదీ కౌటాల మండలం పార్డీ, సాడ్‌గాం, వీరవెల్లి, కౌఠి గ్రామాల పరిస్థితి. ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటైన గ్రామాలు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించి, పత్తా లేకుండా పోతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.

ఇదేమి దారి.. పడిపోరా జారి..

మండలంలోని పార్డీ, సాండ్‌గాం, కౌఠి, వీర్‌వెల్లి గ్రామాలకు 20 ఏళ్ల కిందట ప్రపంచ బ్యాంకు నిధులతో మొరం రోడ్డు నిర్మించారు. మండలంలోని ముత్తంపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పార్డీ గ్రామం మీదుగా సాండ్‌గాం వరకు దాదాపు 7 కిలో మీటర్లు మొరం రోడ్డు వేశారు. ప్రస్తుతం మొరం రోడ్డు బురదమయంగా మారింది. మండల కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న పార్డీ, సాండ్‌గాం, కౌఠి, వీరవెల్లి గ్రామాలకు తారురోడ్డు కోసం ప్రజలు దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్నారు. గ్రామానికి రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేదని వాపోయారు.

ఎడ్ల బండ్లు, కాలినడకే..

గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు రావాలంటే ఎడ్ల బండ్లు, మోటారు సైకిళ్లు, కాలినడక ద్వారా రావాల్సి వస్తోందని విద్యార్థులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి రావాలంటే బురదమయమైన మొరం రోడ్డే దిక్కు. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. గత నెల 31న జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ముత్తంపేట్ - పార్డీ రోడ్డు పరిశీలించి గుంతలను పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చెప్పినా అధికారులు మాత్రం రోడ్డును పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం లేదు



మా గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేదు. పాలకులు మారిన మా రోడ్డు పరిస్థితి మాత్రం మారడం లేదు. ప్రస్తుతం ఉన్నా రోడ్డు బురదమయంగా మారింది. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి తారురోడ్డు వేయాలి.

– సంజీవ్, పార్డీ



తారురోడ్డు వేయాలని గ్రామస్తుల నిరసన

తమ గ్రామాలకు తారురోడ్డు వేయాలని కౌటాల మండలం పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి, కౌఠి గ్రామాల ప్రజలు శుక్రవారం పార్డీ–ముత్తంపేట్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామాలకు ఇప్పటికే మట్టి రోడ్డే ఉందన్నారు. లారీలు వెళ్లడంతో గుంతలు పడ్డాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బురదమయంగా మారి నడవలేని దుస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

క్రీడల కోసం సమయం కేటాయించాలి

రెబ్బెన: యాంత్రిక జీవనానికి అలవాటు పడి క్రీడలను నిర్లక్ష్యం చేయకుండా కాస్త సయమాన్ని క్రీడల కోసం కేటాయించాలని ఇన్‌చార్జి జీఎం నరేందర్ అన్నారు. శుక్రవారం గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలని మొబైల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏఐటీయూసీ నాయకులు మొగిళి, రెడ్డిమల్ల తిరుపతి, ప్రశాంత్, కిరణ్‌బాబు, చంద్రకుమార్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

పెంచికల్‌పేట్(సిర్పూర్): గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఆర్‌డీవో దత్తారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతువేదికలో శుక్రవారం కమ్మర్‌గాం, మురళీగూడ గ్రామాలకు చెందిన ప్రజలతో సమావేశమయ్యారు. గ్రామాల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. అంతకు ముందు అధికారులు మురళీగూడ, కమ్మర్‌గాం గ్రామాలను సందర్శించి సీసీ రోడ్లు, తాగునీరు, గిరివికాస్, పెన్షన్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి లబ్ధిదారుల వివరాలు నమోదు చేశారు. పెంచికల్‌పేట్ నుంచి కమ్మర్‌గాం, కమ్మర్‌గాం నుంచి బెజ్జూర్ వరకు రహదారి పరిశీలించారు. అనంతరం పెంచికల్‌పేట్ పీహెచ్‌సీని పరిశీలించి మరమతులకు కొలతలు తీసుకున్నారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఏఈ బద్రొద్దిన్, ఎస్‌బీఎం అధికారులు సాయి, ఫణి, ఏపీవో సతీశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీవో దత్తారావు

సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: నాయకుల మోసపూరిత వాగ్దానాల ఉచ్చులో పడి మోసపోవద్దని, సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎస్పీఎం కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ట్రేడ్ యూనియన్‌లో అనుభవం లేని రాజకీయ నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఉన్న వారిని గెలిపిస్తే మోసపోతారన్నారు. సీఐటీయూను గెలిపిస్తే మెరుగైన వేతనాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, ఎస్పీఎం మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కూశన రాజన్న, ముంజం శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మల్లికార్జున్